సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం। 22। ఆగస్టు। 2023



చీనీ టన్ను రూ.18 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 628 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.



టమాట కిలో రూ.32
కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.32 పలికింది. కనిష్టంగా రూ.15, సరాసరిన రూ.24 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.5°/22.3°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ఐటీఐ కోర్సుల్లో అడ్మిషన్లు

లేపాక్షి: ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు మూడో విడత అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. లేపాక్షిలోని వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఐటీఐతోపాటు జిల్లాలోని 14 ప్రైవేటు ఐటీఐల్లో వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు. ఆసక్తి గల వారు www.iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 27వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. 28వ తేదీన ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 30వ తేదీన ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుంది.

చికెన్ సెంటరులో కొండ చిలువ కలకలం



కొండ చిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్ మూర్తి

ప్రశాంతి నిలయం: ఓ చికెన్ సెంటరులోకి కొండ చిలువ ప్రవేశించడంతో కలకలం రేగింది. ఈ ఘటన సోమవారం పుట్టపర్తి మండల పరిధిలో జరిగింది. స్థానిక ఎనుములపల్లి చెరువు సమీపాన చిత్రావతి బైపాస్ రోడ్డుకు ఆనుకుని ముక్తార్ అనే వ్యక్తి చికెన్ సెంటరు నిర్వహిస్తున్నాడు. వెనుక ఉన్న కొండలో నుంచి ఆదివారం రాత్రి కొండ చిలువ చికెన్ సెంటరులోకి ప్రవేశించింది. నాలుగు బ్రాయిలర్ కోళ్లను తినేసిన తర్వాత నీటి డ్రమ్ములోకి చేరుకుంది. సోమవారం ఉదయం ముక్తార్ నీటి కోసం డ్రమ్ము వద్దకు వెళ్లగా..కొండ చిలువ కన్పించింది. దాదాపు తొమ్మిది అడుగుల పొడవు ఉంది. భయభ్రాంతులకు గురైన అతను చుట్టుపక్కల వారికి చెప్పడంతో వారు కూడా భయంతో పరుగులు తీశారు. చివరకు పుట్టపర్తికి చెందిన స్నేక్ క్యాచర్ మూర్తికి సమాచారం ఇవ్వడంతో అతను అక్కడికి చేరుకుని కొండచిలువను చాకచక్యంగా పట్టుకున్నాడు. తర్వాత సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలి పెట్టాడు.

జిల్లాలోకి ప్రవేశించిన కృష్ణా జలాలు



హంద్రీ-నీవా ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలు

వజ్రకరూరు: జిల్లాలోకి కృష్ణా జలాలు ప్రవేశించాయి. ఈ నెల16న కర్నూలు జిల్లా మల్యాల వద్ద హంద్రీ-నీవా ప్రధాన కాలువకు రెండు పంపులతో నీటి పంపింగ్ ప్రారంభించారు. ప్రస్తుతం ఆరు పంపులతో పంపింగ్ చేస్తున్నారు. సోమవారం ఉదయానికి అనంతపురం జిల్లా సరిహద్దు అయిన 144 కిలోమీటరు వద్దకు జలాలు చేరాయి. రాత్రికి రాగులపాడు ఎత్తిపోతల(లిఫ్ట్)కు చేరుకున్నాయి. హంద్రీ-నీవా ప్రధాన కాలువలో కృష్ణా జలాలు ప్రవహించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. 155వ కిలోమీటరు వద్ద హంద్రీ-నీవా ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలను ఈఈ రాజశేఖర్‌యాదవ్ పరిశీలించారు. మంగళవారం రాగులపాడు ఎత్తిపోతలనుంచి జీడిపల్లి రిజర్వాయర్‌కు నీటి పంపింగ్ ప్రారంభంకానున్నట్లు వెల్లడించారు.

పండుగలా గృహప్రవేశాలు

- ఈ నెల 30న నిర్వహించేందుకు ఏర్పాట్లు ఘనంగా చేయాలి
- 'స్పందన' అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి
- 'పెనుకొండ' అభివృద్ధిపై 25న సమీక్ష
- కలెక్టర్ అరుణ్‌బాబు



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30న సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహణ కోసం గోరంట్ల మండలం మల్లాపల్లి వైఎస్సార్ జగనన్న కాలనీని ఎంపిక చేశామన్నారు. ఈనెల 24వ తేదీలోపు అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. పండుగ వాతావరణంలో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించేలా ఏర్పాట్లు ఘనంగా చేయాలని ఆదేశించారు.

వివరాలతో సిద్ధంగా ఉండాలి

పెనుకొండ నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే శంకరనారాయణ అధ్యక్షతన ఈనెల 25న సమీక్ష సమావేశం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో మాట్లాడారు. సమీక్షకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం హాజరవుతారని, అన్ని శాఖల అధికారులు తప్పక పాల్గొనాలన్నారు. ఆయా శాఖల తరఫున చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు, ఇతరత్రా ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకోవాలన్నారు. పుట్టపర్తి, మడకశిర, కదిరి నియోజకవర్గాల అభివృద్ధిపై జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యేలు ప్రస్తావించిన అంశాలపై సమగ్ర నివేదికలను సిద్ధం చేసుకుని తనకు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఒక్క అర్జీ రీఓపెన్ కాకూడదు..

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందనలో అందే అర్జీలన్నింటికీ నాణ్యమైన పరిష్కారం చూపాలని, ఒక్క అర్జీ కూడా రీఓపెన్ కాకూడదని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన డీఆర్‌ఓ కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ విజయ్‌కుమార్ తదితరులతో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 176 అర్జీలు అందగా, వాటి పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు డివిజన్, మండల స్థాయి అధికారులతో వర్చువల్‌గా మాట్లాడారు. గత వారం 10 అర్జీలు రీ ఓపెన్ అయ్యాయని, వాటికి నాణ్యమైన పరిష్కారం చూపి మళ్లీ స్పందనలో అర్జీ అందకుండా చూడాలన్నారు. ఆర్డీఓలు, తహసీల్దార్లు క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యను పరిశీలించి పరిష్కరించాలన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలే స్పందనలో ఎక్కువగా వస్తున్నాయని, ఆయా మండలాల తహసీల్దార్లు మరింత బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

'స్పందన'లో అందిన అర్జీల్లో కొన్ని...

- గ్రామీణ ప్రాంతాల నుంచి పుట్టపర్తికి బస్సు సౌకర్యం కల్పించాలని వినియోగదారుల సంఘం సమాఖ్య ప్రధాన కార్యదర్శి సురేష కలెక్టర్‌కు విన్నవించారు. అదేవిధంగా బెంగళూరు వెళ్లడానికి కేవలం ఒక బస్సు మాత్రమే నడుపుతున్నారని తెలిపారు. స్పందించిన కలెక్టర్ వెంటనే ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
- జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తన పొలంతో పాటు పెద్ద షెడ్డు, రెండు రూములు కోల్పోతున్నా పరిహారం తక్కువగా ఇస్తున్నారని గోరంట్ల మండలం గుంతపల్లికి చెందిన రవీంద్రరెడ్డి తెలిపారు. తగిన న్యాయం చేసి ఆదుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన కలెక్టర్ ఆర్డీఓను పంపి విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు.
- తాము దినసరి కూలీలుగా ఉపాధి పొందుతున్నామని, నిలువ నీడ లేదని, ఇల్లు మంజూరు చేయాలని గోరంట్ల మండలం సామలపల్లికి చెందిన సుకన్య, తిప్పమ్మ, నాగలక్ష్మి కలెక్టర్‌ను కోరారు.
- తన భర్త కరోనా సమయంలో మృతి చెందడంతో 5, 8 తరగతులు చదువుతున్న ఇద్దరు పిల్లల భారం తనపై పడిందని ముదిగుబ్బ మండలం జొన్నలకొత్తపల్లికి చెందిన విజయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. తన పిల్లలకు ఏదైనా ఎస్సీ హాస్టల్‌లో అడ్మిషన్లు కల్పించాలని విన్నవించారు.

సర్వే వంద శాతం పూర్తి చేయాలి

ఓటరు సమగ్ర జాబితా తయారీకి నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే 100 శాతం పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన సూచనలను ప్రతి ఒక్కరూ శ్రద్ధగా చదివాలని, వాటిని ఒక పుస్తకం రూపంలో ముద్రించి దగ్గర ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. తాను ఆయా మండలాల్లో పర్యటించినప్పుడు కచ్చితంగా సదరు పుస్తకాన్ని చూస్తానన్నారు.

- మంగళవారం నుంచి హిందూపురంలో సదరం క్యాంప్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని, అలాగే ఈ విషయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి పద్మమ్మ, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

నాన్న వద్దు.. ఆస్తి ముద్దు

- తండ్రిని రోడ్డున వదిలేసిన సంతానం
- కాలు విరిగినా పట్టించుకోని వైనం



ఎస్.వెంకటరెడ్డి

అనంతపురం అర్బన్: తన అవసరాలు మానుకుని బిడ్డల ఉన్నతికి తపించాడు. వారి భవిష్యత్తు కోసం రెక్కలు ముక్కలు చేసుకున్నాడు. ఆస్తులు కూడబెట్టాడు. పెళ్లిళ్లు చేశాడు. కూడబెట్టిన ఆస్తులూ పంచిచ్చాడు. ఇక్కడ వరకూ అంతా బాగున్నా.. ఆస్తులు పంచుకున్న బిడ్డలు మాత్రం ఆ తండ్రిని ఛీదరించుకున్నారు. పిడికెడు బువ్వ పెట్టడం కూడా భారమనుకున్నారు. నిర్దాక్షిణ్యంగా నడిరోడ్డుపై వదిలేశారు. తన గోడును కలెక్టర్ వద్ద చెప్పుకునేందుకు సోమవారం ఉదయం నడవలేని స్థితిలో దేక్కుంటూ కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన్ను 'సాక్షి' పలకరించగా.. కన్నీటి వ్యథ బయటకొచ్చింది. వివరాలు ఆయన మాటల్లోనే..

'ఏం చెప్పను సారూ.. నా కష్టం పగోడికి కూడా రాకూడదు (కళ్లలో ఉబికి వస్తున్న నీటిని తుడుచుకుంటూ). నాది బుక్కరాయసముద్రం మండలం గోవిందంపల్లి. నా పేరు వెంకటరెడ్డి. ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు. వ్యవసాయం చేసి బిడ్డలను పోషించాం. రెక్కలు ముక్కలు చేసుకుని పని చేసి మరింత పొలం కొన్నా. నా భార్య చనిపోయింది. బిడ్డలకు పెళ్లిళ్లు చేశా. పెద్దోడికి నాలుగు ఎకరాలు, రెండోవాడికి మూడు ఎకరాలు, ఓ కూతురికి ఇల్లు, ఎకరా భూమి ఇచ్చా. మరో కుమార్తెకు ఇచ్చేందుకు నా వద్ద ఏమీ మిగల్లేదు. ఆస్తులు పంచిచ్చిన తర్వాత బిడ్డలకు నేను భారమైపోయా. పిడికెడు బువ్వ పెట్టడం భారమనుకుని మూడేళ్ల క్రితం ఇంటి నుంచి గెంటేశారు. కొంత కాలం గొట్కూరు వద్ద అనాథాశ్రమంలో ఉన్నా. ఆ తర్వాత ఇక్కడే పెద్దాస్పత్రి (సర్వజనాస్పత్రి) వద్దకు చేరుకున్నా. దాతలు పెట్టే అన్నం తింటూ గోడవారన పడుకుంటున్నా. ఈ మధ్య నా కాలు విరిగినా చూసేందుకు పిల్లలు రాలేదు. ఆస్పత్రి వాళ్లే చికిత్స చేశారు. ఎక్కడికి వెళ్లాలన్నా నడవలేని స్థితిలో ఇలా దేక్కుంటూ పోవాలి.'

న్యాయం కోసం ఎస్పీ వద్దకు..

స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన పలువురు.. వెంకటరెడ్డి బాధను విన్న తర్వాత వారి కళ్లు చెమర్చాయి. 'పెద్దాయనా.. నీ బిడ్డలకు బుద్ధి రావాలంటే పోలీసులైతేనే మేలు. నీవు ఎస్పీ వద్దకెళ్లి బాధ చెప్పుకో' అంటూ సలహా ఇచ్చారు. ' ఆ సార్ ఎక్కడుంటాడో నాకు తెల్వదయ్యా.. మీరే అక్కడకు చేర్చి పుణ్యం కట్టుకోండి. అక్కడికి పోయేందుకు నా వద్ద డబ్బు కూడా లేదు' అంటూ వెంకటరెడ్డి తెలపడంతో.. అక్కడున్న వారు స్పందించి వెంటనే ఆటో మాట్లాడి వృద్ధుడిని ఎస్పీ కార్యాలయానికి చేర్చారు.

ఉర్రూతలూగించిన 'ఫ్లాష్ మాబ్'

వైద్య కళాశాల వార్షికోత్సవ సంబరాలు ప్రారంభం



డ్యాన్సుతో అలరిస్తున్న వైద్య విద్యార్థినులు

అనంతపురం క్రైం: 'ఏ చీకటి చెరిపేయని కలనే కనాలి', 'బోటనీ పాఠం ఉంది.. మ్యాటనీ ఆట ఉంది', 'మారో మారో గోలీ మారో'.. తదితర పాటలకు వైద్య విద్యార్థులు డ్యాన్సులతో అదరగొట్టారు. ఓ వైపు స్టెప్పులతో దుమ్మురేపగా.. మరోవైపు నుంచి తోటి విద్యార్థులు ఈలలు, కేకలతో ఉత్సాహపరిచారు. అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల వార్షికోత్సవ సంబరాలు సోమవారం మొదలయ్యాయి. ఆడిటోరియం ముందున్న ప్రాంగణం వద్ద 'ఫ్లాష్ మాబ్' కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 23న స్టాల్స్ డే, 24న స్పోర్ట్స్ డే, 25న కాలేజీ డే, గోల్డ్ మెడల్స్ ప్రదానం ఉంటుందన్నారు. అనంతరం పోస్టు గ్రాడ్యుయేట్స్ (పీజీ), అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఆరు బృందాలుగా ఏర్పడి, ఒక్కో బృందం 20 నిమిషాల పాటు డ్యాన్స్‌లతో హుషారెత్తించారు. కార్యక్రమంలో అకడమిక్ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ శ్యాం ప్రసాద్, జీజీహెచ్ ప్రొఫెసర్ రవికుమార్, ప్రవీణ్‌దీన్‌కుమార్ పాల్గొన్నారు.



నైపుణ్య విద్యకు ఒప్పందం

- పంజాబ్ వర్సిటీ, జేఎన్‌యూతో సెంట్రల్ యూనివర్సిటీ ఎంఓయూ



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వీసీలు

అనంతపురం: ఏపీ కేంద్రీయ విశ్వవిద్యాలయం (సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ) పంజాబ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (పంజాబ్ -భటిండా), జేఎన్‌యూ (న్యూఢిల్లీ)తో సోమవారం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకుంది. దేశంలో ఉన్నత విద్యా సంస్థల సమూహం పేరుతో కుదుర్చుకున్న ఈ అవగాహన ఒప్పందంలో మూడు అత్యున్నత వర్సిటీలు ఉమ్మడి నిర్ణయాలు అమలు చేయనున్నాయి. న్యూఢిల్లీలో సోమవారం ఏపీ కేంద్రీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సమావేశం జరిగింది. అనంతరం పంజాబ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, జేఎన్‌యూతో అవగాహన ఒప్పంద పత్రాలపై ఆయా వర్సిటీల ప్రతినిధులు సంతకాలు చేశారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ కోరీ మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్యావిధానం అమలు, నైపుణ్య వ్యవస్థాపకతను సులభతరం చేయడం తదితర అంశాలకు ఒప్పందం దోహదపడుతుందన్నారు. ఉమ్మడి డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులను అందించడం, గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, పీహెచ్‌డీ కోర్సులు, ఇంటర్న్‌షిప్ సంయుక్త పర్యవేక్షణ సులభతరం కానుందన్నారు.

విద్యార్థులను పరిపూర్ణులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు
- ఎస్‌ఎస్‌ఎస్‌ఐహెచ్‌ఎల్‌లో ఘనంగా 38వ ఎంబీఏ డే వేడుకలు



కార్యక్రమంలో పాల్గొన్న 1991-93 బ్యాచ్ ఎంబీఏ విద్యార్థులు, ఉపన్యాసకులు



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఆర్‌జే రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: మానవతా విలువలు, ఆధ్యాత్మికతతో పాటు శాస్త్ర, సాంకేతికత రంగాలకు సంబంధించిన ఆధునిక విద్యను అందిస్తూ విద్యార్థులను పరిపూర్ణులుగా తీర్చిదిద్దడమే సత్యసాయి విద్యావిధానం లక్ష్యమని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు అన్నారు. సోమవారం సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ (ఎస్‌ఎస్‌ఎస్‌ఐహెచ్‌ఎల్) ఆడిటోరియంలో వైస్ చాన్సలర్ రాఘవేంద్ర ప్రసాద్ అధ్యక్షతన 38వ ఎంబీఏ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న 1991-93 విద్యాసంవత్సరానికి చెందిన ఎంబీఏ పూర్వ విద్యార్థులు ప్రస్తుతం ఎంబీఏ చదువుతున్న విద్యార్థులతో తమ అనుభవాలు పంచుకున్నారు. అదే బ్యాచ్‌లో ఎంబీఏ చేసిన ఆర్‌జే రత్నాకర్ రాజు కూడా పూర్వ విద్యార్థిగా సమావేశంలో మాట్లాడారు. 1986 ఆగస్టు 21న సత్యసాయి విద్యాసంస్థల్లో ఎంబీఏ కోర్సును భగవాన్ సత్యసాయి ప్రారంభించారనీ, అప్పటి నుంచి ఏటా సత్యసాయి విద్యాసంస్థల్లో ఆగస్టు 21న ఎంబీఏ డే నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని ఏర్పరుచుకుని ఆ దిశగా ముందుకు సాగాలన్నారు. ఎంచుకున్న రంగంలో రాణించేందుకు అవసరమైన జ్ఞానాన్ని పూర్తి స్థాయిలో పొందేందుకు ప్రయత్నించాలన్నారు. సమాజ అవసరాలను గుర్తించి నాణ్యమైన సేవలను అందించేందుకు తమను తాము సమర్థవంతులుగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమసమాజ నిర్మాణ బాధ్యతను యువత స్వీకరించాలన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా...అక్కడి పరిస్థితులకు అనుగుణంగా సమర్థవంతమైన సేవలందించే విధంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంబీఏ ఉపన్యాసకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటకు ఆటంకాలెన్నో!

- రూ. 209 కోట్లతో నిర్మిస్తున్న కదిరి బైపాస్‌రోడ్డు
- భూసేకరణ జాప్యంతో ముందుకు సాగని పనులు
- బైపాస్ పూర్తయితే తీరనున్న ట్రాఫిక్ కష్టాలు



రూ.209 కోట్లతో నిర్మిస్తున్న బైపాస్‌రోడ్డు

కదిరి: పట్టణానికి రింగ్‌రోడ్డు తరహాలో రూ.209 కోట్లతో నిర్మిస్తున్న బైపాస్‌రోడ్డు పనులకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. సుమారు 12 కి.మీ మేర పట్టణానికి చుట్టూ ఏర్పాటు చేస్తున్న ఈ బైపాస్ రోడ్డు పూర్తయితే కదిరిలోకి వచ్చే వాహనాల సంఖ్య బాగా తగ్గిపోతుంది. తద్వారా పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. కానీ కొందరు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు ముందుకు సాగడం లేదు. ప్రధానంగా బైపాస్‌కు సంబంధించిన భూసేకరణ విషయంలో ఓ రెవెన్యూ అధికారి నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతోంది. లేదంటే ఈ పాటికి పనులు పూర్తయి బైపాస్‌రోడ్డు అందుబాటులోకి వచ్చేది.

మాట తప్పిన చంద్రబాబు..

సీఎం హోదాలో చంద్రబాబు 2014లో కదిరికి విచ్చేసినప్పుడు పట్టణానికి రింగ్‌రోడ్డు మంజూరు చేస్తున్నానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత దాన్ని పూర్తిగా విస్మరించి కదిరి వాసులను మోసం చేశారు. దీనిపై వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి అప్పట్లో ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. ఆయన దీక్షను అప్పట్లో పోలీసుల ద్వారా చంద్రబాబు సర్కారు ఒక్కరోజుకే భగ్నం చేయించింది. అయితే తాము అధికారంలోకి రాగానే బైపాస్‌రోడ్డు ఏర్పాటు చేసి తీరుతామని డాక్టర్ సిద్దారెడ్డి ఆరోజే హామీ ఇచ్చారు. దీంతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకట ప్రసాద్‌తో పాటు వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి టీడీపీలో చేరిన చాంద్‌బాషా డైలమాలో పడ్డారు. నిధులు కేటాయింపులు లేకుండానే కదిరికి రింగ్‌రోడ్డు మంజూరైందంటూ అప్పట్లో కదిరి పట్టణానికి చెరోవైపు కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేసి అభాసుపాలయ్యారు.

సిద్దారెడ్డి చొరవతో బైపాస్ మంజూరు..

రింగ్‌రోడ్డు పేరుతో కదిరి ప్రజలను చంద్రబాబు మోసగించిన విషయాన్ని ఎమ్మెల్యే సిద్దారెడ్డి సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. తన దీక్ష విషయాన్ని కూడా గుర్తు చేశారు. స్పందించిన సీఎం ఈ విషయంపై కేంద్రంతో సంప్రదించారు. తర్వాత కొద్ది నెలలకే కదిరికి రింగ్‌రోడ్డు తరహాలో బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం రూ.209 కోట్లు నిధులు మంజూరయ్యాయి. జిల్లాలో ఎక్కడా లేని విధంగా భూనిర్వాసితులకు ఎకరాకు రూ.17 లక్షల నుంచి రూ.30 లక్షలు దాకా ఇచ్చారు. కానీ కొంత మంది కోర్టుకు వెళ్లడం..ఇతరత్రా భూ సేకరణ సమస్యలతో బైపాస్ రోడ్డు పనులు ఆలస్యమవుతున్నాయి.


మారనున్న కదిరి రూపురేఖలు



రింగ్‌రోడ్డు తరహాలో నిర్మిస్తున్న బైపాస్‌రోడ్డుతో కదిరి రూపురేఖలు మారనున్నాయి. వీలైనంత వరకూ ఈ ఏడాది చివరి నాటికి బైపాస్‌రోడ్డును ప్రారంభించాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం. అందుకే తరచూ పనులపైనే సమీక్షిస్తున్నా. భూసేకరణలో కొంత జాప్యం జరుగుతోంది. లేదంటే ఈ ఏడాది ఏప్రిల్‌కే బైపాస్‌రోడ్డు పూర్తయ్యేది.

– డా.పీవీ సిద్దారెడ్డి, ఎమ్మెల్యే, కదిరి

త్వరలోనే అందుబాటులోకి తెస్తాం



బైపాస్‌రోడ్డు భూ సేకరణలో ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయి. సాగులో ఒకరుంటే..పట్టా మరొకరి పేరుతో ఉంటుంది. పరిహారం సరిపోవడం లేదని కొందరు, భూవివాదాలతో కోర్టును ఆశ్రయించిన వారు మరికొందరు..ఇలా అవాంతరాలున్నాయి. త్వరలోనే వీటన్నింటినీ పరిష్కరించి బైపాస్‌రోడ్డును త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

– రాఘవేంద్ర, ఆర్డీఓ, కదిరి

చంద్రబాబు మోసం చేశారు



జగన్ ప్రభుత్వం బైపాస్ పనులు ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అయితే భూసేకరణ విషయంలో అధికారులు చొరవ చూపక పోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది.

– నాగరాజు, కుటాగుళ్ల

క్లుప్తంగా

ఆరుకు చేరిన మృతుల సంఖ్య


గాయత్రి (ఫైల్)

తాడిమర్రి: విద్యుత్ ప్రమాదంలో మృతుల సంఖ్య ఆరుకు చేరుకుంది. గత ఏడాది జూన్ 30న పెద్దకోట్ల, గుడ్డంపల్లి గ్రామాలకు చెందిన మహిళలు ఆటోలో కూలి పనులకు వెళ్తుండగా చిల్లకొండయ్యపల్లి వద్ద 11 కేవీ విద్యుత్ తీగలు తెగి ఆటోపై పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఐదుగురు మహిళలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తీవ్రంగా గాయపడిన గుడ్డంపల్లి గ్రామానికి చెందిన కొంకా గాయత్రి (29)ని కుటుంబసభ్యులు బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కొన్ని నెలల పాటు అక్కడే చికిత్స పొందింది. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఇటీవల అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక ఆదివారం రాత్రి ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ పాటిల్ భువనేశ్వరరెడ్డి.. మృతురాలి భర్త మంజునాథ్‌ను ఫోన్‌లో పరామర్శించారు. మృతురాలికి ఆరో తరగతి చదువుతున్న హర్షిత, నాల్గో తరగతి చదువుతున్న జయశ్రీ, ఎల్‌కేజీ చదువుతున్న హనేశ్వర్‌కుమార్ ఉన్నారు.

'పోలీస్ స్పందన'కు 39 వినతులు


అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 39 వినతులు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా అర్జీలు స్వీకరించి, బాధితులతో సమస్య తీవ్రతను రాబట్టుకున్నారు. చట్టపరిధిలోని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. ప్రతి అర్జీకి సంతృప్తికర పరిష్కారాన్ని నిర్దేశించిన గడువులోపు చూపాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, దిశ డీఎస్పీ వరప్రసాద్, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సత్యసాయి సంకీర్తన


మహా నగర సంకీర్తనను ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకరరాజు


చిత్రావతి నది వద్ద మహా మంగళ హారతినిస్తున్న భక్తులు


జల హారతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

- వేలాదిగా తరలివచ్చిన శ్రీకాకుళం భక్తులు

ప్రశాంతి నిలయం: శ్రీకాకుళం సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ ఆ ప్రాంతానికి చెందిన సత్యసాయి భక్తులు సోమవారం ప్రశాంతి నిలయం వేదికగా చేపట్టిన మహానగర సంకీర్తన నేత్రపర్వంగా సాగింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన శ్రీకాకుళం సత్యసాయి భక్తులు... స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద నుంచి నగర సంకీర్తన చేపట్టారు. కార్యక్రమాన్ని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకరరాజు ప్రారంభించారు. మహిళలు కలశాలు చేత పట్టుకుని సత్యసాయి స్మరిస్తూ ముందు వరుసలో వెళుతుండగా వెనుకనే దివ్యరథాన్ని లాగుతూ వేలాది భక్తులు అనుసరించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం సత్యసాయి బాలవికాస్ విద్యార్థులు వివిధ పౌరాణిక వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఆ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా జానపద నృత్యాలు, కోలాటాలు, డప్పు వాయిద్యంతో కళాకారులు అలరించారు. వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ప్రారంభమైన మహానగర సంకీర్తన తిరిగి ప్రశాంతి నిలయం తూర్పు ద్వారం వద్ద మహా మంగళహారతితో ముగిసింది.

వేడుకలా చిత్రావతి మంగళహారతి..

సత్యసాయి నడయాడిన చిత్రావతి నదీ ప్రాంతాన్ని పవిత్ర పుణ్యస్థలంగా భావించే సత్యసాయి భక్తులు పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన సమయంలో చిత్రావతి మంగళహారతి ఘట్టాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శ్రీకాకుళం సత్యసాయి భక్తులు సోమవారం వేకువజామునే చిత్రావతి నది వద్దకు చేరుకుని మహా మంగళహారతిని నివేదించారు. చిత్రావతి నదిలో బోటుపై సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు, కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఆర్వో కొండయ్య

లేపాక్షి: మండలంలోని కుశలవ ఆర్గానిక్ ప్రాడక్ట్ యాజమాన్యానికి కొండూరు, కొర్లకుంట గ్రామాలకు చెందిన రైతులు విక్రయించిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య తెలిపారు. తమ భూములను తమకే కేటాయించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట 8 రోజులుగా రైతులు నిరసన కార్యక్రమాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న డీఆర్వో ముందుగా ఆందోళనకారులతో సమావేశమై చర్చించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 58 మంది రైతులతో 186 ఎకరాలను కుశలవ ఆర్గానిక్ ప్రాడక్ట్ యాజమాన్యం కొనుగోలు చేసిందన్నారు. ఇందులో 146 ఎకరాలను పీఓటీ చట్టం మేరకు ప్రభుత్వం స్వాధీనం చేసుకుందన్నారు. మిగిలిన భూమిలో 18 ఎకరాలకు సంబంధించి రికార్డులు 1954కు ముందు ఉన్నాయని, మరో 22 ఎకరాలకు సంబంధించి కంపెనీ యాజమాన్యం సరైన డాక్యుమెంట్లు సమర్పించలేదన్నారు. అయితే స్వాధీనం చేసుకున్న భూములపై 90 రోజుల్లోపు రైతులు అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

వ్యక్తిపై దాడి

నల్లచెరువు: మండల పరిధిలోని దామవాండ్లపల్లి గ్రామంలో జయరాం అనే వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు దామవాండ్లపల్లికి చెందిన జయరాంపై అదే గ్రామానికి చెందిన గణేష్, గంగరాజు కర్రలు, ఇటుకలతో తలపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు గమనించి జయరాంను కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాధితుడి భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

'ఉత్తమ' అవార్డులకు ప్రతిపాదనలు పంపాలి

ప్రశాంతి నిలయం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని (సెప్టెంబర్ 5న) పురస్కరించుకుని ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం అవార్డులు ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు ఈనెల 24వ తేదీలోపు ప్రతిపాదనలు పంపాలని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు ఆయా మండల విద్యాధికారులకు తమ ప్రతిపాదనలు పంపాలని, వారు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి సదరు ప్రతిపాదనలు చేరవేస్తారన్నారు. జిల్లా ఉప విద్యాధికారులు, మండల విద్యాధికారులు వారి పరిధిలోని ఉపాధ్యాయులకు సమాచారం చేరవేయాలన్నారు.

వైద్యాధికారులకు డిప్యుటేషన్

చిలమత్తూరు: మండల వైద్యాధికారులు డా.రామకృష్ణ, డా.తేజశ్వినిని డిప్యుటేషన్‌పై మరో ప్రాంతానికి బదిలీ చేస్తూ డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బత్తలపల్లికి రామకృష్ణను, కొండాపురానికి తేజశ్వినిని తాత్కాలిక చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బుక్కపట్నం పీహెచ్‌సీలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న డాక్టర్ నికేష్‌ను తిరిగి చిలమత్తూరు పీహెచ్‌సీకి పంపుతూ ఉత్తర్వులిచ్చారు. అలాగే ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్, ఎంపీహెచ్‌ఏలు షాజహాన్, జయప్రకాష్‌కు షోకాజ్ నోటీస్‌లు జారీ చేశారు.

ఇప్పటికైనా పనితీరు మార్చుకోండి: డీఈఓ


రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ మీనాక్షి

ఎన్‌పీకుంట: ఇప్పటికై నా పనితీరు మార్చుకుని విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు జిల్లా విద్యాధికారి మీనాక్షి సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. ఇటీవల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పర్యటనలో పలు లోపాలు బయటపడ్డాయన్నారు. బీసీ బాలుర వసతి గృహంలోని విద్యార్థులు పాఠ్య పుస్తకాల నిర్వహణ, ట్యాబ్‌ల వినియోగం సరిగ్గా లేకపోవడం, విద్యార్థుల సాధనా పుస్తకాలను ఉపాధ్యాయులు మూల్యాంకనం చేయకపోవడం, 9వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన లేకపోవడం తదితర అంశాలను ఆయన తీవ్రంగా పరిగణించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికై నా ఉపాధ్యాయులు శ్రద్ధతో పాఠ్యాంశాల బోధనతో పాటు, సాధనా పుస్తకాలను సరిచూస్తూ ఉండాలని సూచించారు. ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులను చైతన్య పరచాలన్నారు. సమస్య పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శిరిషారెడ్డి పాల్గొన్నారు.

కోలుకుంటున్న అనంతపురం డీఈఓ


డీఈఓ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న అనంతపురం డీఎంహెచ్‌ఓ డా.యుగంధర్

రాప్తాడు రూరల్: కోమాలో ఉన్న అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.సాయిరాం క్రమంగా కోలుకుంటున్నారు. ఈ మేరకు బెంగళూరులో ఆయన చికిత్స పొందుతున్న ఆస్టర్ సీఎంఐ వైద్యులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండు రోజులుగా ఏ మాత్రం స్పందన లేని ఆయన సోమవారం పిలిస్తే కళ్లు తెరిచి చూస్తున్నారు. అయితే మాట్లాడలేకపోతున్నారు. ఇతర స్పందనలూ లేవు. కాగా, అనంతపురం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఆ జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ బెంగళూరుకు వెళ్లి డీఈఓ ఆరోగ్య పరిస్థితిపై అక్కడి వైద్యులతో మాట్లాడారు. మెదడుకు రక్తం పంపింగ్ చేసే నాళం, సంకేతాలు తీసుకెళ్లే నాళం అక్కడక్కడ క్లాట్ అయినట్లు వైద్యులు వెల్లడించారు. క్లాట్‌ను కరిగించే మందులు ఇస్తున్నట్లు వివరించారు. దీనికి తోడు చికిత్సకు ఇతర అవయవాలు అంతంత మాత్రంగానే సహకరిస్తుండడంతో కోలుకునేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ఇది వరకే గుండెకు సంబంధించి, బ్రెయిన్‌కు సంబంధించిన వ్యాధులతో బాధపడుతుండం కూడా కాస్తా ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు.

వ్యక్తి బలవన్మరణం


మృతుడు నారాయణస్వామి

తాడిపత్రి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం తేరన్నపల్లికి చెందిన నారాయణ స్వామి (50), రాములమ్మ దంపతులకు ఓ కుమారుడు ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కుటుంబంలో కలహాలు చోటుచేసుకోవడంతో మనస్తాపం చెందిన నారాయణస్వామి సోమవారం సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి వెళ్లాడు. అనంతరం బయటకు వచ్చిన ఆయన మద్యం బాటిల్ కొనుగోలు చేసి, తనతో పాటు తీసుకెళ్లిన పురుగుల మందును కలుపుకుని గ్రామ శివారులోకి వెళ్లి తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న నారాయణస్వామిని గుర్తించిన అటుగా వెళుతున్న వారు సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని వెంటనే తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రిమాండ్ ఖైదీ మృతి



బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న ఓ ఖైదీ గుండె పోటుతో మృతి చెందాడు. ఈ మేరకు జిల్లా జైలు సూపరింటెండెంట్ రహమాన్ సోమవారం తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లి మండలానికి చెందిన కోనేటి వీరన్న (50) తన భార్యకు భరణం చెల్లించే విషయంలో నిర్లక్ష్యం వహించిన అంశానికి సంబంధించి న్యాయమూర్తి ఆదేశాల మేరకు నెల రోజుల క్రితం అక్కడి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ క్రమంలో జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న ఆయన ఆదివారం రాత్రి గుండెపోటుకు గురయ్యాడు. విషయాన్ని తెలుసుకున్న వెంటనే వీరన్నను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి జైలు సిబ్బంది తరలించింది. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై బీకేఎస్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరు సీఐల బదిలీ

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పుట్టపర్తి 'దిశ'సీఐగా ఉన్న యతేంద్రను ముదిగుబ్బకు, హిందూపురం టూటౌన్ సీఐ వై.శ్రీనివాసులును హిందూపురం రూరల్ స్టేషన్‌కు బదిలీ చేశారు. కాగా, ముదిగుబ్బ సీఐగా పనిచేసిన కంబగిరి రాములును నాలుగు రోజుల క్రితమే వీఆర్‌కు పంపారు. అలాగే హిందూపురం రూరల్ (యూపీఎస్)లో గతంలో సీఐగా పనిచేస్తున్న కృష్ణారెడ్డి చిత్తూరు జిల్లా పుంగనూరుకు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

ప్రతి నిరుపేదకూ పక్కా ఇల్లు

- పూరి గుడిసెలు లేని రాష్ట్రంగా చూడాలన్నదే జగనన్న లక్ష్యం
- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్


గృహ నిర్మాణాలకు భూమిపూజ చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం రూరల్: పూరి గుడిసెలు లేని రాష్ట్రం చూడాలన్నదే సీఎం వైఎస్ జగనన్న లక్ష్యమని మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి నిరుపేదకూ పక్కా ఇంటిని నిర్మించి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కళ్యాణదుర్గం మండలం గోళ్ల పంచాయతీ కురాకులతోటలో సోమవారం వైఎస్సార్ జగనన్న కాలనీలో నూతన గృహ నిర్మాణాలకు సోమవారం ఆమె భూమిపూజ చేసి, మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, బిల్లుల విషయంలో లబ్ధిదారులను ఇబ్బంది పెట్టకూడదని హౌసింగ్ ఏఈ లోక్‌నాథ్ చౌదరికి సూచించారు. లబ్ధిదారులు పునాది తీసిన వెంటనే ఫొటోలు అప్‌లోడ్ చేస్తే వెంటనే బిల్లులు మంజూరవుతాయన్నారు. పేదల పక్కా గృహాలు నిర్మించి ఇవ్వడంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందన్నారు. టీడీపీ హయాంలో కేవలం జన్మభూమి కమిటీ సభ్యులకు మాత్రమే గృహాలు నిర్మించి ఇచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా ఇళ్లతో పాటు సంక్షేమ పథకాలనూ అందజేస్తున్నామన్నారు. ఈ విషయంగా ఎక్కడేగాని వివక్షకు తావులేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా వ్యవహరిస్తున్నారన్నారు. అనంతరం స్థానిక నాయకులతో ఆమె సమావేశమై మాట్లాడారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ బాలాజీ, జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహమాన్, స్థానిక నాయకులు మోహన్‌రెడ్డి, రామలింగప్ప, శ్రీనివాసులు, తిమ్మారెడ్డి, పోతేష్, గోవిందప్ప, కొండారెడ్డి, గోపాల్, నాగేంద్ర, మల్లికార్జున, రామకృష్ణ, రాము, బిక్కిహరి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం


వెంకటేష్ (ఫైల్)

పెనుకొండ రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా రాప్తాడు మండలం హంపాపురానికి చెందిన వడ్డే వెంకటేష్ (27).. పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులు ముగించుకుని అమ్మవారిపల్లి నుంచి గుట్టూరు వైపుగా నడుచుకుంటూ వెళుతుండగా కియా పోలీస్ స్టేషన్ ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా దూసుకెళ్లి పోయాడు. ఘటనపై కియా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'పురం'లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



హిందూపురం అర్బన్: స్థానిక చర్చిగ్రౌండ్ వద్ద సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి (45) మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ హరూన్‌బాషా అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడిని పట్టణంలోని ఓ ధాబాలో పనిచేసుకునేవాడిగా గుర్తించారు. పుష్ప అని పిలిచేవారని, తాగుడుకు బానిసైన ఆయన అతిగా మద్యం సేవించి మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా, మృతుడు ఏ ప్రాంతానికి చెందిన వాడో తెలియదు. ఆచూకీ తెలిసిన వారు హిందూపురం పోలీసులను స్పందించాలని ఎస్ఐ హరూన్ బాషా కోరారు.

రైలు ఢీకొని యువకుడి మృతి


యువకుడి మృతదేహం

అనంతపురం సిటీ: స్థానిక రాజీవ్ కాలనీ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని సోమవారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడికి పాతికేళ్ల వయసుంటుందని నిర్ధారించారు. పింక్ కలర్ టీ షర్ట్, నేవీ బ్లూ కలర్ నైట్ ప్యాంట్ ధరించాడు. కుడిచేతిపై 'ఏవీ' అని, 'అమ్మ' అని తెలుగులో పచ్చబొట్టు ఉంది. రైలు ఢీకొనడంతోనే మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆచూకీ తెలిసిన వారు 99088 37888, 85002 38200కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

అమడగూరు: చోరీ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఓడీ చెరువు ఎస్ఐ గోపి తెలిపారు. నిందితుల వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. ఆదివారం రాత్రి కందుకూరిపల్లికి చెందిన పాగాకు జయరాంను ఇద్దరు దారి దోపిడీదారులు అటకాయించి సెల్‌ఫోన్ లాక్కొని ఉడాయించారు. ఘటనకు సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. పక్కా ఆధారాలతో గజ్జలరెడ్డిపల్లికి చెందిన షేక్ హుజీర్, షేక్ జునైద్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. దీంతో చోరీ చేసింది తామేనని వారు అంగీకరించడంతో కత్తితో పాటు సెల్‌ఫోన్, రూ.300, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై సోమవారం కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఉపాధ్యాయులకు చార్జ్ మెమో

కదిరి అర్బన్: స్థానిక కుటాగుళ్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని ముగ్గురు ఉపాధ్యాయులకు డీఈఓ మీనాక్షి సోమవారం చార్జ్ మెమో జారీ చేశారు. ఈ నెల 19న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఆ పాఠశాలలో 9వ తరగతిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో విద్యార్థులు రాసిన పరీక్షలను సక్రమంగా మూల్యాంకనం చేయలేదనే విషయాన్ని ఆయన గుర్తించారు. ఈ అంశంపై ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు హెచ్‌ఎం వరప్రసాదరాజు, ఉపాధ్యాయులు ధర్మానందరెడ్డి, సుప్రియకు డీఈఓ చార్జ్ మెమో జారీ చేశారు.